క్లుప్తంగా

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా సెక్టార్ డైరెక్టర్ విశా ఫెర్రర్

కూడేరు: పేద మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే విశా ఫెర్రర్ మహిళా పరస్పర సహకార సంఘం (మహిళా బ్యాంక్) లక్ష్యమని ఆర్డీటీ మహిళా సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో విశా ఫెర్రర్ మహిళా పరస్పర సహకార సంఘం లిమిటెడ్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి విశాల ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘంలోని ప్రతి సభ్యురాలు వాటాగా రూ.500 పొదుపు చేసుకోవడం, ఆ డబ్బును వడ్డీకి ఇవ్వడం, వడ్డీ ద్వారా వచ్చే ఆదాయాన్ని అందరికీ పంచడంతో ఆదాయాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఆ సంస్థ డైరెక్టర్ రష్మిక నిరంజన్, రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం



ఆలయ భూములకు వేలం వేస్తున్న అధికారులు

ఉరవకొండ: రేణుమాకుపల్లిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ భూములకు ఈఓ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం వేలం వేశారు. ఈఓ మాట్లాడుతూ ఆలయానికి చెందిన సర్వే నం. 103లోని భూములకు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.1.62 లక్షలు వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.1.44 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణయ్య, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా నివారణపై అవగాహన

రాయదుర్గంటౌన్: ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా నివారణపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ ప్రజలకు సూచించారు. శనివారం పట్టణంలోని 16,17 వార్డుల్లో దోమల నివారణ, సీజనల్ వ్యాధులు, నివారణపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, సూర్య నారాయణ, హెల్త్ సెక్రటరీలు ప్రమీల, లలిత, శైలజ, ఆశా కార్యకర్తలు స్వాతి, శారద పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



రంగయ్యను సన్మానిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. శనివారం పార్టీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు మాజీ ఎంపీ రంగయ్యను కలిసి సన్మానించారు. రంగయ్య మాట్లాడుతూ పార్టీ అనుబంధ విభాగాల్లో చోటు దక్కిన వారికి మరింత బాధ్యత పెరిగిందని, గ్రామ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొండాపురం రాము, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మంజు, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు జానీ, శంకర్‌నాయక్, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు కిరణ్, రాజు, సోము తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం కూలీల నిరసన

కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లించాలని శనివారం నిరసన తెలియజేశారు. కూలీలు మాట్లాడుతూ మూడు నెలలుగా ఉపాధి పనులు చేసినా బిల్లులు అందలేదన్నారు. మరోవైపు డ్రైల్యాండ్ హార్టికల్చర్ రైతులకు 5 నెలలుగా రూపాయి కూడా బిల్లు అందలేదన్నారు. కొత్తగా చేరిన ఫీల్డ్ అసిస్టెంట్లు కొందరు జాబ్ కార్డుల్లో ఉన్న పేర్లకు బదులు తమ బంధువుల పేర్లమీద బిల్లులు కాజేస్తున్నట్లు ఆరోపించారు. ఎంపీడీఓ లక్ష్మీశంకర్ మాట్లాడుతూ త్వరలోనే బిల్లులు కూలీల ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

ఉమా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఉమా క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు సత్తి, దొడగట్ట నారాయణ, కేసీ చెన్నకేశవుల గౌడ్, కొత్తూరు బాబు, గోవిందప్ప, బోరంపల్లి రామిరెడ్డి, జాకీర్, జైపాల్‌రెడ్డి, కొలప్ప, నరేష్, మంజు, గిరిబాబు, శ్రీనివాసులు, వేణుగోపాల్, భరత్, అనిల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం..ఉత్తిదే

- చేనేత కార్మికురాలికి ఆన్‌లైన్‌లో పదెకరాల భూమి
- ఒకే ఇంట్లో ఐదుగురు పిల్లలున్నా ఒక్కరికీ వర్తించని వైనం
- సాంకేతిక తప్పిదాలతో 'తల్లికి వందనం' దూరం

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు 'నీకు రూ.15 వేలు...నీకు రూ.15 వేలు...నీకు రూ.15 వేలు..' ఇలా ఇంట్లో ఎంత మంది చదివే పిల్లలున్నా.. అందరికీ 'తల్లికి వందనం' వర్తింపజేస్తామని ఇంటింటికీ వెళ్లి పేరుపేరునా ప్రకటించారు. అధికారంలో కొచ్చిన ఏడాదిలోనే అర్హులందరికీ ఎగనామం పెట్టారు. జాబితాలో వందశాతం అర్హులుగా ఉన్న వారికి కొర్రీలు పెట్టారు. కొందరికి, కూలీ నాలీ చేసుకొనే వారికి కూడా వారి పేరున భూమి ఎక్కువ ఉందని అనర్హులుగా చూపించారు. ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 1,223 మంది వరకు అనర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది.

ఉరవకొండ నియోజకవర్గంలో తల్లికి వందనం అనర్హుల వివరాలు:

మండలం	అనర్హుల వివరాలు
ఉరవకొండ	380
విడపనకల్లు	220
బెళుగుప్ప	190
కూడేరు	203
వజ్రకరూరు	230
మొత్తం	1,223





- ఈ చిత్రంలో కనిపిస్తున్న హంపేష్, చైతన్య దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వజ్రకరూరు మండలం పొలికి గ్రామానికి చెందిన ఈ దంపతులకు మౌనిక (7వ తరగతి) పవిత్ర (6వ తరగతి) హర్షవర్ధన్ (2వ తరగతి) చదువుతున్నారు. హంపేష్‌కు రెండెకరాల భూమి మాత్రమే ఉంది. కానీ ఆన్‌లైన్‌లో ఈదంపతుల పేరుపైన ఆరెకరాల మాగాణి ఉందని చూపుతోంది. దీంతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా చూపుతోంది.

ముగ్గురు పిల్లలున్నా తల్లికి వందనం జాబితాలో అనర్హతగా చూపారంటున్న హంపేష్, చైతన్య దంపతులు



- ఈ చిత్రంలో ఐదుగురు పిల్లలతో ఉన్న ఓబుళేసు నాయక్, భాగ్యమ్మ దంపతులది ఉరవకొండ మండలం రాచెర్ల తండా గ్రామం. కూలీ నాలీ చేసుకొనే పేద కుటుంబంలో ఒక్కరికీ 'తల్లికి వందనం' పథకం వర్తించలేదు. పెద్ద కుమార్తె కీర్తన(10వ తరగతి) షర్మిలా (9వ తరగతి) ప్రియాంక (5వ తరగతి) సమంత (4వ తరగతి) అభిషేక్ (2వ తరగతి) చదువుతున్నారు. ఐదుగురు పిల్లల పేర్లు అర్హుల జాబితాలో ఉన్నా ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా తల్లికి వందనం నగదు జమ కాలేదు. దాదాపు రూ.65 వేలు జమ కావాల్సి ఉన్నా తమకు ఒక్క పైసా కూడా జమ కాలేదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఐదుగురు పిల్లలున్నా ఒక్కరికి తల్లికి వందనం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓబులేసు నాయక్, భాగ్యమ్మ దంపతులు



- చేనేత మగ్గంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ దంపతుల పేర్లు దేవరకొండ మీనాక్షి, ప్రసాద్ 'తల్లికి వందనం' పథకం ప్రారంభమైనప్పటి నుంచి కాళ్లరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. వారిని ఒక్కరూ పట్టించుకోలేదు. మీనాక్షికి భావన అనే కుమార్తె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తన కుమార్తెకు వందనం నగదు జమకాకపోవడంతో సచివాలయానికి వెళ్తే 'నీ పేరు మీద కోనాపురంలో పది ఎకరాల భూమి ఆన్‌లైన్ చూపిస్తోంది.. నీకు పథకం వర్తించదు అని చెప్పారు. మగ్గం నేయడం తప్ప తనకు సెంటు భూమి కూడా లేదని, తనకు భూమి ఎక్కడ ఉందో చూపాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ''

పథకం వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉరవకొండకు చెందిన చేనేత కార్మికురాలు మీనాక్షి

అనర్హులుగా చూపించారు



ఆన్‌లైన్‌లో లేని భూమిని ఉన్నట్లు చూపి తల్లికి వందనానికి అనర్హులుగా చూపించారు. నా కుమారుడు విష్ణువర్ధన్ 10వ తరగతి చదువుతున్నాడు. గతంలో అమ్మ ఒడి ఏటా వర్తించేది. ఈయేడాది లేని భూమిని చూపి అనర్హులంటున్నారు. అధికారులు ఒక్కరూ దీనిపై పట్టించుకోవడం లేదు.

– ప్రసాద్, రాకెట్ల గ్రామం, ఉరవకొండ మండలం

రైతు ఉత్పత్తిదారు సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా

బెళుగుప్ప: మండలంలోని రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘాలు మరింత ఆర్థికవృద్ధి సాధించడమే లక్ష్యమని ఎకాలజీ విభాగం ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా, ఎఫ్‌టీఓ మేనేజర్ రమేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని శాంతిదామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ అధ్యక్షురాలు శిరీష అధ్యక్షతన 9వ వార్షికోత్సవ మహాసభ జరిగింది. ఎఫ్‌పీఓ మేనేజర్ రమేష్, సీఈఓలు గాయిత్రి, హరీష్ పాల్గొన్నారు. తొలుత బోర్డు డైరెక్టరీలోని 15 మంది పాలకవర్గం సభ్యులు రైతు ఉత్పత్తిదారు వాటాదారులతో కలసి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పెట్టుబడులను తగ్గించుకొని, నికర లాభాలు ఆర్జించే వెసులుబాటు కల్పించడమే సంఘం లక్ష్యమని అన్నారు. సంఘాల పరిధిలో రైతులు పండించిన పంటలను గ్రూపులుగా విక్రయించి, మార్కెటింగ్ చేసుకుంటే వచ్చే లాభాల్లోనూ సభ్యులకు వాటాలు, బోనస్‌లు సమానంగా సభ్యులు పంచుకుంటారన్నారు. కేవలం రూ.5 లక్షలతో ప్రారంభమైన సంఘం.. 9 వార్షికోత్సవాలుగా రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు జరిపిందన్నారు. కార్యక్రమంలో ఎంటీఎల్ భవాని, సంఘం సలహాదారు సంజీవరెడ్డి, ఎస్‌టీఓలు, సీఈఓలు, బీఓడీ సభ్యులు, రైతులు ,మహిళా రైతు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30న మెగా జాబ్ మేళా

ఉరవకొండ: స్థానిక మహాత్మా డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు, స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారులు శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో 10కి పైగా నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈజాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు (https:// naipunyam, ap.gov.in/ user - resistration) నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9885508017, 7013800115లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాలవాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణానాయక్‌ను కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య శనివారం పరామర్శించారు. కృష్ణానాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు గోళ్ల సూరి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎస్ హనుమంతురాయుడు, సర్పంచ్ నాగరత్నమ్మ , మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి, అశోక్‌రెడ్డి, నాయకులు గోపాల్, మురళి, బీటీ రామాంజనేయులు, భూశప్ప, లోకేష్, అదెప్ప, అనంద్, సత్యనారాయణ, దుర్గన్న, రమినేపల్లి గోపాల్, రామాంజనేయులు, బాలాజీ నాయక్, ఈడిగ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం

కుందుర్పి: మండలంలోని నాగేపల్లి, కర్ణాటక సరిహద్దునున్న బీడు భూముల్లో మొక్కల పెంపకం చేపడుతున్నట్లు ఆదివాసీ వెల్ఫేర్ ఫౌండేషన్ మేనేజర్ నవీన్ కుమార్ తెలిపారు. శనివారం మండల సరిహద్దున ఉన్న నాగేపల్లి, పరశురాంపురం తదితర గ్రామాల పరిధిలోని బీడు భూముల్లో మొక్కల పెంపకం చేపట్టారు. కార్యక్రమంలో కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరశింహమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగభూషణ, లోకేష్ రైతులు పాల్గొన్నారు.

వజ్రకరూరు ఏఎస్‌ఓగా పర్వతప్ప

వజ్రకరూరు: మండల ఏఎస్‌ఓ (సహాయ గణాంక అధికారి)గా ఎం.పర్వతప్ప నియమితులయ్యారు. విడపనకల్లు మండలంలో పనిచేస్తున్న పర్వతప్ప వజ్రకరూరుకు బదిలీపై వచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓ మాట్లాడారు.

వాహనాల తనిఖీ

వజ్రకరూరు: మండల కేంద్రం వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ నాగ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు జరిమానా విధించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి: మండలంలోని మలయనూరు-1 సబ్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వైద్యాధికారి కరుణసాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, స్థానిక గ్రామ కోడలు, లేదా అదే గ్రామానికి చెందిన వితంతువు అయ్యి ఉండాలన్నారు.

ఉపాధిహామీ ఏపీఓగా విమల

వజ్రకరూరు: మండల ఉపాధిహామీ ఏపీఓగా విమల నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ లక్ష్మీకాంతబాయి బొమ్మనహాళ్ మండలానికి బదిలీ అయ్యారు. ఉరవకొండ మండల ఏపీఓ విమల వజ్రకరూరుకు బదిలీపై వచ్చారు.

సామూహిక సెలవుపై పంచాయతీ కార్యదర్శులు



సామూహిక సెలవుపై వెళ్తున్నట్లు ఎంపీడీఓకు సమాచారం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గుమ్మఘట్ట: మండలంలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పనిభారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్లోరినేషన్, చెత్త సేకరణపై ఉదయం 7 గంటలకే క్షేత్ర స్థాయిలో ఉండాలనే నిబంధనను తొలగించాలని వారు కోరారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వెనక్కి తీసుకోకపోతే జూలై 5 వతేదీ తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీల సంఘం అధ్యక్షుడు కొల్లప్ప, రంగారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ నేత లక్ష్మన్న స్థూపం ఆవిష్కరణ

కుందుర్పి: సీపీఐ సీనియర్ నేత, కామ్రేడ్ పీ లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థూపం ఆవిష్కరిస్తున్నట్లు డివిజన్ కార్యదర్శి గోపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బండమీదపల్లి రోడ్డు భారత్ గ్యాస్ గోడౌన్ సమీపంలో కార్యక్రమం జరగనుంది. ఈకార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు హాజరవుతున్నారని లక్ష్మన్న కుమారుడు రాధకృష్ణంరాజు తెలిపారు.

కొలువుతీరిన లాలు స్వామిపీర్లు



వజ్రకరూరులో కొలువుదీరిన లాలుస్వామి పీర్లు

వజ్రకరూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా స్థానిక లాలుస్వామి ఆలయంలో పీర్లు కొలువుదీరాయి.ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం నిర్వాహకులు మాబుసాబ్, రహంతుల్లా, షబ్బీర్, నాగరాజురావు పూజలు నిర్వహించా రు. మూడో రోజులు ప్రత్యేక పూజలు, నాల్గో రోజు పీర్ల అలంకరణ, ఐదో రోజు ఆభరణాల అలంకరణ, ఆరో రోజు చిన్నగిరిడి ఊరేగింపు, ఏడో రోజు హుసేన్, హుసేన్ స్వాముల ఊరేగింపు, 8వ రోజు పూజలు, 9వ రోజు భక్తుల నుంచి కానుకల స్వీకరణ, చక్కెర చదివింపులు, పదోరోజు జలధి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రారంభమైన మొహర్రం వేడుకలు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట, గలగల, గోనబావి, పూలకుంట, 75వీరాపురం, గొల్లపల్లి, బేలోడు, భూపసముద్రం, నేత్రపల్లి, తాళ్లకెర తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యా యి. పీర్ల చావిడిలకు రంగులు అద్ది, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కనీస వేతనం అమలు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాయదుర్గంటౌన్: జీవో 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది డిమాండ్ల పరిష్కారం కోరుతూ పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. స్థానిక వినాయక సర్కిల్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా మున్సిపల్ కార్యాలయం సాగింది. అక్కడ నిరసన తెలియజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జూలైలో చలో విజయవాడ కార్యక్రమం, నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు వేగవంతం చేయాలి



లైనింగ్ పనులను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ సీఈఈ నాగరాజు, తదితరులు

బొమ్మనహాళ్/ కణేకల్లు: హెచ్చెల్సీ మరమ్మతు పనులను నాణ్యతగా వేగవంతంగా గడువులోపు పూర్తి చేయాలని హెచ్చెల్సీ సీఈఈ నాగరాజు ఆదేశించారు. శనివారం కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలోని బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో జరుగుతున్న అత్యవసర మరమ్మతు పనులను ఆయన హెచ్చెల్సీ ఈఈ పార్థసారథి, కణేకల్లు డీఈఈ దివాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. 115వ కిలోమీటర్ నుంచి 189వ కిలోమీటర్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించి నాణ్యతపై కాంట్రాక్టర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. నాగలాపురం వద్ద జరుగుతున్న వంతెన, లైనింగ్ పనులను పరిశీలించారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి జూలై 10న నీరు విడుదల చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యవసర మరమ్మతుల పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. స్థానిక అధికారులు దగ్గరుండి పనులు చేయించాలని, అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సీఈఈ హెచ్చరించారు. పనులు ఇప్పటి వరకు 60 శాతం జరిగాయని తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఖరీఫ్ సాగుకు ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

ఆలేరి విజయలక్ష్మికి కన్నీటి వీడ్కోలు



అంతిమయాత్రలో పాడె మోసిన తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి



అంతిమ సంస్కార కార్యక్రమంలో పాల్గొన్న అనంత, మెట్టు, రంగయ్య

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, గరుడచేడు మాజీ సర్పంచు ఆలేరి విజయలక్ష్మి (65) అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. అనారోగ్యంతో బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని అంబులెన్స్‌లో శనివారం వేకువజామున గరుడచేడుకు తీసుకొచ్చారు. విజయలక్ష్మి మృతితో గ్రామం శోకసంద్రంగా మారింది. ఆమెను కడసారిగా చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తదితరులు విజయలక్ష్మి భౌతికాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆలేరి రాజగోపాల్‌రెడ్డిని పరామర్శించి ఓదార్చారు. మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య పాడె మోశారు. ఉరవకొండ యువనేత వై.భీమిరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, రాయదుర్గం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షులు ఉషారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ గొని ఉపేంద్రరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిసుద్దుగురు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, వైఎస్సార్‌సీపీ నాయకులు కళేకుర్తి జయరామిరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, రాయదుర్గం పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఘనంగా నృసింహుడి పల్లకీ సేవ



స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఉరవకొండ రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీ నృసింహస్వామి పల్లకీ సేవను ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

బ్రహ్మసముద్రం : పౌర హక్కులపై అవగాహన అవసరమని తహసీల్దార్ సుమతి తెలిపారు. శనివారం కన్నేపల్లిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో కుల, మత వర్గ బేధాలు లేకుండా ఐకమత్యంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, వీఆర్వో నాగరాజు, పోలీసు సిబ్బంది గుడదప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 51 మందికి ఉద్యోగాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించారు. ఏడీఎంఎస్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం, సీఐఎల్‌తోపాటు 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జాబ్‌మేళాకు 120 మంది అభ్యర్థులు హాజరుకాగా 51 మందిని వివిధ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి కంపెనీ ప్రతినిధులు నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీడాప్ సావిత్రమ్మ, ఏపీ ఎస్ఎస్ డీసీ కోఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

కంది సాగును ప్రోత్సహించాలన్నదే లక్ష్యం

గుమ్మఘట్ట: కంది సాగును ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పూలకుంటలో ఉచితంగా కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ నిర్మల్‌కుమార్, ఎంపీపీ భవాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, వైస్ చైర్మన్ దానవేంద్ర, సన్నన్న పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే సరుకులు అందించకపోతే చర్యలు

కూడేరు: 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి అందించాలని, లేదంటే చర్యలు తప్పవని ఆర్డీఓ కేశవనాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన ఇప్పేరు, కలగళ్ల గ్రామాల్లో పర్యటించారు. పలువురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి డీలర్లు రేషన్ సరకులు ఇంటి వద్దకే వచ్చి ఇచ్చారా? అని ఆర్డీఓ ఆరా తీశారు. కొందరు వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను ఆర్డీఓ అందజేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఎస్‌డీటీ శాంతకుమారి, వీఆర్వోలు ఇమ్రాన్, శంకర నారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తాం

వజ్రకరూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని ఎంపీడీఓ శివాజీరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక గంజికుంట గ్రామంలో ఎంపీడీఓ శివాజీరెడ్డి పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ కింద నిర్మిస్తున్న గోకులంషెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి, అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ పూజలు చేశారు.